
# కేసీఆర్ బొండిగ పిసికే కుట్ర

## బీఆర్ఎస్ అధినేతపై మోదీ, రాహుల్‌గాంధీ పగ • దేశంలో విస్తరిస్తారని బీజేపీ, కాంగ్రెస్‌కు భయం: కేటీఆర్

### షేర్లు, తీస్మార్‌ఖాన్లు ఎంతమంది వచ్చినా ప్రజలే మా ధైర్యం

- తెలంగాణ తలరాతను రాసే ఎన్నికలివి
- 65 ఏండ్ల దరిద్రం కాంగ్రెస్‌ను మళ్లీ దరిచేరనీయొద్దు
- మహిళలను ఏడిపించే కుసంస్కారం కమలం పార్టీది
- ఉమక్క ఉసురు బీజేపీకి తగులుతుంది
- కథలాపూర్ ప్రజా ఆశీర్వాద సభ, పలుచోట్ల ఎన్నికల రోడ్‌షోలలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

జగిత్యాల, నవంబర్ 15 (నమస్తే తెలంగాణ): తెలంగాణ గొంతుక, 52 కిలోల సీఎం కేసీఆర్‌ను ఖతం చేసేందుకు బీజేపీ, కాంగ్రెస్ ప్రయత్నిస్తున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కే తారకరామారావు ఆరోపించారు. కేసీఆర్‌పై ప్రధాని మోదీ, రాహుల్‌గాంధీ పగబట్టారని, తెలంగాణలో గెలిస్తే బీఆర్ఎస్ దేశమంతా విస్తరిస్తుందని, ఆయన బొండిగ పిసికేందుకు చూస్తున్నారని అన్నారు. అమిత్‌షాలు, యోగీలు, బోగీలు, 16 మంది సీఎంలు, షేర్లు, షేర్‌ఖాన్లు, బబ్బర్‌షేర్లు, తీస్‌మార్‌ఖాన్లు తెలంగాణకు వస్తున్నారని, అయినా రాష్ట్ర ప్రజలే తమ ధైర్యమని స్పష్టం చేశారు. జగిత్యాల జిల్లా కథలాపూర్‌లో వేములవాడ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ బుధవారం నిర్వహించిన ప్రజాఆశీర్వాద సభ, రుద్రంగి, కోనారావుపేట, వేములవాడ, తంగళ్లపల్లిలో నిర్వహించిన ఎన్నికల రోడ్ షోలలో మంత్రి కేటీఆర్ పాల్గొన్నారు. నియోజకవర్గ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావును గెలిపించాలని పిలుపునిచ్చిన ఆయన.. ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. నవంబర్ 30న జరిగే ఎన్నికలు తెలంగాణ తలరాతను రాసే ఎన్నికలని, ప్రజలు అన్ని విధాలుగా ఆలోచించి, మేలు చేసే వారికి మద్దతు తెలపాలని కోరారు. ఎంతో కష్టపడి సాధించుకున్న తెలంగాణను ఎవరి చేతిలో పెట్టాలో ప్రజలు ఆలోచించాల్సిన సమయం ఆసన్నమైనదని అన్నారు. తొమ్మిదిన్నరేండ్లలో రెండేండ్లు కరోనా సావగొట్టిందని, పార్లమెంట్, మున్సిపల్, పంచాయతీ ఎన్నికలు అంటూ మరో ఏడాది కాలం పోయిందని, కేవలం ఆరున్నర ఏండ్ల కాలంలోనే సరైన పాలన సాగిందని వివరించారు. ఆరున్నర ఏండ్ల పాలనలో తెలంగాణ బాగైందా? చెడిపోయిందా? ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు. నాడు 29 లక్షల మందికి రూ.200 చొప్పున పింఛన్ ఇస్తే, ఇప్పుడు 46 లక్షల మందికి రూ.2 వేల పెన్షన్ ఇస్తున్నామని గుర్తుచేశారు. గతంలో ఏ ప్రభుత్వమైనా బీడీ కార్మికులకు పెన్షన్ ఇచ్చే ఆలోచన చేసిందా? అని అడిగారు. కాంగ్రెస్ పాలనలో కరెంట్ కష్టాలు ప్రజలందరికీ ఇప్పటికీ గుర్తున్నాయని తెలిపారు. ప్రజలు తియ్యటి, పుల్లటి మాటలకు మోసపోవద్దని హితవు చెప్పారు. గోదావరి నీళ్లను వేములవాడకు తీసుకువచ్చి, కరెంట్ కష్టాలు సీఎం కేసీఆర్ తీరిస్తే, కాంగ్రెస్, బీజేపీ వాళ్లు అడ్డదిడ్డంగా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ మాటలు వింటూ మళ్లీ వాళ్ల పాలన నాటి దిక్కుమాలిన రోజులకు వెళ్దామా? అని ప్రజలను ప్రశ్నించారు. అడ్డగోలుగా మాట్లాడిన ప్రధాని మోదీ మోచేతికి బెల్లం పెట్టి నాకించినట్టు చేశారని విమర్శించారు. రూ.400గా ఉన్న సిలిండర్ ధరను రూ.1,200కు పెంచారని మండిపడ్డారు. అయితే, 13.5 లక్షల మందికి కల్యాణలక్ష్మి పథకాన్ని వర్తింపజేసి, ప్రతి ఆడబిడ్డను మేనమామలాగా సీఎం కేసీఆర్ దీవించారని గుర్తుచేశారు. రాష్ట్రంలో 18 ఏండ్లు నిండిన మహిళలందరికీ నెలకు రూ.3 వేలు ఇచ్చే సౌభాగ్యలక్ష్మి పథకాన్ని అధికారంలోకి రాగానే అమలు చేస్తామని చెప్పారు. రాష్ట్రంలోని 93 లక్షల కుటుంబాలకు 'కేసీఆర్ బీమా.. ప్రతి ఇంటికి దీమా' పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించినట్టు వివరించారు. 93 లక్షల కుటుంబాలకు సన్నబియ్యం పంపిణీ చేసే పథకాన్ని ప్రారంభిస్తామని చెప్పారు. ఈ ఎన్నికల పోరాటాన్ని ఢిల్లీ దొరలు, తెలంగాణ ప్రజలకు మధ్య జరిగే పోరాటంగా భావిస్తున్నట్టు వెల్లడించారు.



రుద్రంగి రోడ్‌షోలో ప్రజలకు నమస్కరిస్తున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు, బీఆర్ఎస్ నేత తుల ఉమ

### కేటీఆర్ చెప్పిన తేలు కథ

ఈ సందర్భంగా కేటీఆర్ తేలు కథను ఉదహరించారు. 'ఓ ఇంట్లో భార్యాభర్తలిద్దరు మాట్లాడుకుంటున్నరు. అప్పుడే పైనుంచి భార్యపై తేలుపడింది. నా మీద తేలుపడ్డది అని భర్తకు చెప్పడంతో ఆయన బయటకు పరుగుపెట్టడం మొదలు పెట్టాడట. దీంతో భార్య ఎందుకు బయటకు వెళ్తున్నావని భర్తను ప్రశ్నించగా, తేలును చంపే మొగోళ్లను తోలుకు వచ్చేందుకు వెళ్తున్నా అన్నాడట. అట్లా ఉంది బీజేపీ, కాంగ్రెస్ తీరు' అని ఎద్దేవా చేశారు. ఇక్కడి బీజేపీ, కాంగ్రెసోళ్లు మొనగాళ్లే అయితే ఢిల్లీవాళ్లతో ఏం పని? ఇక్కడే కొట్లాడొచ్చు కదా? అని చురకలు అంటించారు.

### కేటీఆర్ వాహనం తనిఖీ చేసిన పోలీసులు

రుద్రంగి, నవంబర్ 15: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ వాహనాన్ని బుధవారం పోలీసులు తనిఖీ చేశారు. జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలంలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభను ముగించుకొని రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగిలో నిర్వహించే రోడ్ షోకు వస్తుండగా రుద్రంగి చెక్‌పోస్ట్ వద్ద కేటీఆర్ వాహనాన్ని, కాన్వాయ్‌ను పోలీసులు తనిఖీ చేశారు. ఎన్నికల నిబంధనల మేరకు పోలీసులకు కేటీఆర్ పూర్తి సహకారం అందించారు.

### వేములవాడ నియోజకవర్గాన్ని దత్తత తీసుకుంటా

వేములవాడ నియోజకవర్గాన్ని దత్తత తీసుకుంటానని మంత్రి కేటీఆర్ అన్నారు. సిరిసిల్లను అభివృద్ధి చేసినట్లు వేములవాడను అభివృద్ధి చేసే బాధ్యత తాను తీసుకుంటానని తెలిపారు. తుల ఉమక్క లాంటి ఉద్యమకారిణిని అవమానించి, బీఫాం ఇవ్వకుండా ఏడిపించిన బీజేపీకి ప్రజలే బుద్ధి చెప్పాలని, ఆ పార్టీకి డిపాజిట్ రాకుండా చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఉమక్కకు గతం కంటే మంచి పదవి ఇచ్చే పూచీ తనదేనని అన్నారు. కార్యక్రమాల్లో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్, వేములవాడ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు, వేములవాడ మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, జగిత్యాల జిల్లా పరిషత్తు చైర్‌పర్సన్ దావ వసంత, వైస్‌చైర్మన్ వొద్దినేని హరిచరణ్‌రావు, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ, నాగం భూమయ్య, జవ్వాజి రేవతి తదితరులు పాల్గొన్నారు.


### కేటీఆర్ రోడ్‌షోకు కొత్త ప్రచార రథం

హైదరాబాద్, నవంబర్ 15 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్‌కు పార్టీ కొత్త వాహనాన్ని సమకూర్చింది. ఈ వాహనం అత్యాధునిక హంగులతో పటిష్టంగా చెన్నైలో ముస్తాబైంది. ఇటీవల ఆర్మూర్ రోడ్‌షోలో ప్రచార రథం నుంచి కిందపడబోతూ కేటీఆర్ త్రుటిలో తప్పించుకున్నారు. ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా ఉండేందుకు మంచి ప్రణాళికతో కొత్త వాహనాన్ని తయారు చేయించారు. ఆరు సీట్ల సామర్థ్యం, ఆటోమెటిక్ లిఫ్ట్‌తో పాటు పలు అత్యాధునిక హంగులతో దీన్ని రూపొందించారు.



జగిత్యాల జిల్లా కథలాపూర్ మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభకు హాజరై నినదిస్తున్న మహిళలు, ప్రజలు

## లోకం పోకడ




మన ప్రచార రథం రెడీ.. వచ్చేయండి!

### భూ వాతావరణంలోకి చంద్రయాన్-3 లాంచర్ విడిభాగం



బెంగళూరు, నవంబర్ 15: చంద్రయాన్-3 స్పేస్ క్రాఫ్ట్‌ను నింగిలోకి తీసుకెళ్లిన ఎల్‌వీఎం-3 ఎం4 రాకెట్ విడిభాగం(క్రయోజనిక్ అప్పర్ స్టేజ్) ఒకటి నియంత్రణ కోల్పోయి తిరిగి భూవాతావరణంలోకి ప్రవేశించింది. బుధవారం మధ్యాహ్నం 2.24 గంటల సమయంలో ఇది భూవాతావరణంలోకి వచ్చినట్టు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) వెల్లడించింది. ఈ ఏడాది జూలైలో చంద్రయాన్ 3ని ప్రయోగించిన విషయం తెలిసిందే. లాంచింగ్ చేసిన 124 రోజుల తర్వాత రాకెట్ విడిభాగం భూ వాతావరణంలోకి ప్రవేశించిందని ఇస్రో తెలిపింది.

## వర్షకాలం

| | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| నల్లగొండ | 35.6°c | 20.0°c |
| ఆదిలాబాద్ | 35.1°c | 14.9°c |
| ఖమ్మం | 33.0°c | 19.0°c |
| మెదక్ | 32.9°c | 17.1°c |
| రంగారెడ్డి | 32.9°c | 15.6°c |
| వరంగల్ | 32.0°c | 21.0°c |
| కరీంనగర్ | 31.0°c | 20.0°c |
| హైదరాబాద్ | 30.7°c | 19.4°c |
| నిజామాబాద్ | 30.5°c | 18.5°c |
| మహబూబ్‌నగర్ | 30.5°c | 21.0°c |

# ముదిరాజ్‌లను ముంచింది కాంగ్రెస్, బీజేపీలే

- బీఆర్ఎస్‌తోనే సామాజిక న్యాయం
- రెచ్చగొట్టే శక్తులకు బుద్ధిచెప్పాలె
- హిట్లర్ కంటే దుర్మార్గుడు రేవంత్‌రెడ్డి
- శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, మాజీ మంత్రి చంద్రశేఖర్, కాసాని జ్ఞానేశ్వర్, ఎర్ర శేఖర్

హైదరాబాద్, నవంబర్ 15 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే సామాజిక న్యాయం సాధ్యమని ముదిరాజ్ సమాజం తేల్చిచెప్పింది. తమ స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం ముదిరాజ్‌లను రెచ్చగొడుతున్న కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చింది. బుధవారం తెలంగాణభవన్‌లో ముదిరాజ్ సంఘ ప్రతినిధులతో జరిగిన సమావేశం అనంతరం శాసనసమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, మాజీమంత్రి పీ చంద్రశేఖర్, మాజీ ఎమ్మెల్సీ కాసాని జ్ఞానేశ్వర్, మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్, మత్స్య పారిశ్రామికాభివృద్ధి సంస్థ చైర్మన్ పిట్టల రవీందర్, టీఎన్జీవో రాష్ట్ర మాజీ అధ్యక్షుడు మామిండ్ల రాజేందర్, ప్రొఫెసర్ దినేశ్, బిత్తిరి సత్తి (రవికుమార్) తదితరులు మీడియాతో మాట్లాడారు. చెరువులు, రిజర్వాయర్లలో ప్రభుత్వమే చేపలు వేసి ఆ సంపదను ఉచితంగా ముదిరాజ్, గంగపుత్రులకు కేటాయించిన ఏకైక ప్రభుత్వం బీఆర్ఎస్ అని బండా ప్రకాశ్ పేర్కొన్నారు. హైదరాబాద్‌లో ముదిరాజ్ భవనానికి వందల కోట్ల విలువ చేసే ఐదెకరాల భూమితోపాటు రూ. 10 కోట్లు కేటాయించి వారి ఆత్మగౌరవం పెంచిన నేత సీఎం కేసీఆర్ అని ప్రశంసించారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీ తమ రాజకీయ అవసరాలు, ఆధిపత్యం కోసం ముదిరాజ్‌లను రెచ్చగొడుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్థికంగా, సామాజికంగా ముదిరాజ్‌లను అణచివేసిన కాంగ్రెస్ పట్ల మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



బుధవారం తెలంగాణ భవన్‌లో మాట్లాడుతున్న బండా ప్రకాశ్. చిత్రంలో బీఆర్ఎస్ నేతలు చంద్రశేఖర్, కాసాని జ్ఞానేశ్వర్, ఎర్రా శేఖర్, మత్స్య పారిశ్రామికావృద్ధి సంస్థ చైర్మన్ పిట్టల రవీందర్, టీఎన్జీవో రాష్ట్ర మాజీ అధ్యక్షుడు మామిండ్ల రాజేందర్, ప్రొఫెసర్ దినేశ్, బిత్తిరి సత్తి

### ఎమ్మెల్యే సీటు ముఖ్యమా? ముదిరాజ్ జాతి అభ్యున్నతి ముఖ్యమా?

ముదిరాజ్ సమాజాన్ని కాంగ్రెస్, బీజేపీ నిండా ముంచాయని మాజీ మంత్రి పీ చంద్రశేఖర్ ఆరోపించారు. ముదిరాజ్‌లకు బీఆర్ఎస్ ఒక్క సీటు కూడా ఇవ్వలేదని కాంగ్రెస్ రెచ్చగొడుతున్నదని, ముదిరాజ్ బిడ్డలెవరూ ఆ ట్రాప్‌లో పడొద్దని సూచించారు. ఈ ఎన్నికల్లో టికెట్ ఇవ్వనంత మాత్రాన ముదిరాజ్‌లను కేసీఆర్ దూరంపెట్టినట్టు కాదని పేర్కొన్నారు. ముదిరాజ్‌ల అభ్యున్నతే మనకు ముఖ్యమని అన్నారు. అనివార్య కారణాల వల్ల సీటు ఇవ్వని బీఆర్ఎస్ వైపు ఉందామా? సీటు ఇచ్చి గుంజుకున్న కాంగ్రెస్ వైపు ఉందామా? అని ప్రశ్నించారు. కాసాని జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్‌తోనే సామాజిక న్యాయం సాధ్యమని స్పష్టం చేశారు. బీసీలు గౌరవంగా తలెత్తుకొని జీవించేలా సీఎం కేసీఆర్ అనేక కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తున్నారని చెప్పారు. ముదిరాజ్‌ల జీవితాలను బాగుచేసిన బీఆర్ఎస్ పార్టీకి అండగా ఉందామని పిలుపునిచ్చారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీకి తగిన బుద్ధి చెప్పాలని మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్ పిలుపునిచ్చారు. ఇప్పుడు ఎమ్మెల్యే టికెట్లను అమ్ముకున్న వారు రేపు అధికారంలోకి వస్తే రాష్ట్రాన్ని అమ్ముకోరని గ్యారెంటీ ఏమిటని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి హిట్లర్ కన్నా దుర్మార్గుడని ముదిరాజ్ నేత నగేశ్ ఆరోపించారు. అన్ని వర్గాలను రెచ్చగొడుతూ సమాజంలో అశాంతికి కారణం అవుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీల మనోధైర్యాన్ని దెబ్బకొడుతున్న రేవంత్‌కు తమ దెబ్బేంటో చూపించాలన్నారు. ఉద్యోగులు, ముదిరాజ్‌లు కేసీఆర్‌కు దూరం అయ్యారని కాంగ్రెస్ చేస్తున్న ప్రచారాన్ని తిప్పికొట్టాలని టీఎన్జీవోస్ మాజీ అధ్యక్షుడు, బీఆర్ఎస్ నేత మామిండ్ల రాజేందర్ ఆగ్రహం పిలుపునిచ్చారు.



### బీజేపీకి విజయశాంతి రాజీనామా!

హైదరాబాద్, నవంబర్ 15 (నమస్తే తెలంగాణ): బీజేపీకి మాజీ ఎంపీ, సీనియర్ నేత విజయశాంతి రాజీనామా చేసినట్టు సమాచారం. బుధవారం తన రాజీనామా లేఖను పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డికి పంపినట్టు తెలిసింది. తనకు బీజేపీలో ప్రాధాన్యం ఇవ్వడం లేదని విజయశాంతి దాదాపు ఏడాది కాలంగా అసంతృప్తితో ఉన్నారు. మునుగోడు ఉప ఎన్నికల్లోనూ పక్కనబెట్టారని, ఆ తర్వాత సమావేశాలకు కూడా పిలవడం మానేశారని అసహనం వ్యక్తంచేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో టిక్కెట్ ఆశించినా దక్కలేదు. ఇటీవల బీజేపీ వేసిన ఎన్నికల కమిటీల్లో ఆమెకు ఆందోళనల కమిటీ బాధ్యతలు అప్పగించారు. అయినా ఆమె సంతృప్తి చెందలేదు. దీంతో పదవికి రాజీనామా చేసినట్టు సమాచారం.



మీడియాతో మాట్లాడుతున్న దాసోజు శ్రవణ్. చిత్రంలో మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

### కేసీఆర్‌ని సవాల్ చేసే నైతికత రేవంత్‌కి లేదు

- ముఖ్యమంత్రి ముందు కుప్పిగంతులు
- బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్

హైదరాబాద్, నవంబర్ 15 (నమస్తే తెలంగాణ): 24 గంటల నిరంతరాయ విద్యుత్తు ఇస్తున్న సీఎం కేసీఆర్‌ను సవాల్ చేసే నైతికత పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి లేదని బీఆర్ఎస్ సీనియర్ నేత దాసోజు శ్రవణ్ విమర్శించారు. 24 గంటల పవర్ లేదని చెప్తున్న రేవంత్‌కి దమ్ముంటే అదే కామారెడ్డిలో ఏదైనా ట్రాన్స్‌ఫార్మర్‌లో చేయిపెట్టి 24 గంటలు నిలబడాలని సవాల్ చేశారు. బుధవారం ఆయన తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలిత కర్ణాటకలో కరెంటు లేక ప్రజలు, రైతులు ఇబ్బందులు పడుతుంటే 24 గంటల కరెంటు ఇస్తున్న కేసీఆర్ ముందు రేవంత్‌రెడ్డి కుప్పిగంతులు వేస్తున్నారని ఎద్దేవా చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో ఇందిరాపార్క్ సాక్షిగా పరిశ్రమల యజమానులు దీక్షలు చేశారని గుర్తుచేశారు. ఇప్పుడు అలాంటి పరిస్థితులు ఉన్నాయా? అని ప్రశ్నించారు. స్వరాష్ట్రంలో విద్యుత్తు ఉత్పత్తి సామర్థ్యం 7,778 మెగావాట్ల నుంచి 18,453 మెగావాట్లకు పెరిగిందని వివరించారు. చంద్రబాబు చెంచాగా, తెలంగాణ ద్రోహిగా పని చేసిన రేవంత్‌కి అమరవీరుల గురించి మాట్లాడే అర్హత ఉన్నదా? అని ప్రశ్నించారు. అమరావతిలా ఇక్కడా 50 వేల ఎకరాలు ల్యాండ్ పూలింగ్ చేస్తామనడంతోనే ఆయన నిజస్వరూపం బయటపడిందని చెప్పారు. సొంత పార్టీ టికెట్లు అమ్ముకున్న రేవంత్‌ని అసెంబ్లీ మెట్టు ఎక్కనీయకూడదని ప్రజలు నిర్ణయించుకున్నారని పేర్కొన్నారు. రేవంత్‌కి మహిళలను గౌరవించే సంస్కారం ఉన్నదా? అని నిలదీశారు.

### • అభిమానం ఉప్పొంగినవేళ..



రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో బుధవారం బీఆర్ఎస్ జెండాలు చేతపట్టి కేరింతలు కొడుతున్న చిన్నారులు

## నిపుణ — విద్య, ఉద్యోగ సమాచారం

### ఎన్‌హెచ్‌ఏఐలో..

నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్‌ఏఐ)లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- మొత్తం ఖాళీలు: 10
- పోస్టులు: మేనేజర్, డిప్యూటీ మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: డిసెంబర్ 14
- వెబ్‌సైట్: www.nhai.gov.in

### బామర్ లారీలో...

ప్రభుత్వ సంస్థ బామర్ లారీ అండ్ కంపెనీ లిమిటెడ్‌లో ఫిక్స్‌డ్ టర్మ్ ప్రాతిపదికన కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- మొత్తం ఖాళీలు: 44
- పోస్టులు: రీజినల్ మేనేజర్, డిప్యూటీ మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్, జూనియర్ ఆఫీసర్ తదితరాలు
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: డిసెంబర్ 6
- వెబ్‌సైట్: www.balmerlawrie.com

### సీబీఐలో..

సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (సీబీఐ)లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- మొత్తం ఖాళీలు: 192
- పోస్టులు: ఆఫీసర్
- విభాగాలు: ఐటీ, రిస్క్ మేనేజర్, ఫైనాన్షియల్ అనలిస్ట్, క్రెడిట్ ఆఫీసర్ తదితరాలు
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: నవంబర్ 19
- వెబ్‌సైట్: https://centralbankofindia.co.in

### ఆన్‌లైన్‌లో స్టడీ మెటీరియల్

పోటీ పరీక్షల ప్రత్యేకం

- బయాలజీ, జీఎస్ (గ్రూప్స్, డీఎస్సీ), ఐఐటీ-నీట్ ఫౌండేషన్ ఫిజిక్స్ కోసం పై క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.